క్లుప్తంగా

21న చెకుముకి పరీక్ష

రాయచోటి అర్బన్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు డిసెంబరు 21న నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో 8, 9, 10 తరగతులలో విద్యార్థులకు నిర్వహించే పరీక్షలలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు మాత్రమే ఈ పోటీలలో పాల్గొనేందుకు అర్హులన్నారు. అన్నమయ్య జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ జరుగుతుందన్నారు. ఈ పరీక్షలలో మండలస్థాయిలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు జిల్లాస్థాయిలో జనవరి 7న పరీక్ష ఉంటుందన్నారు. అలానే ఫిబ్రవరి 10, 11 తేదీలలో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని తెలియజేశారు.

మహాసభలో పాల్గొన్న తపాలా ఉద్యోగులు



మహాసభలో రామాపురం పోస్టల్ నాయకులు

రామాపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్–సీ 40వ ద్వై వార్షిక మహాసభలు సర్కిల్ అధ్యక్ష కార్యదర్శులు క్రామేడ్ శంకర్‌నాయుడు, కామ్రేడ్ శ్రీధర్ బాబుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రకాశం జిల్లా మార్కాపురం డివిజన్‌లో నిర్వహించారు. సమావేశంలో గ్రూప్–సి, గ్రూప్–డి, జీడీఎస్, ఎన్ఎఫ్‌పీఈ కేంద్ర, రాష్ట్ర సంఘాల నాయకత్వం, ఆంధ్రరాష్ట్ర వ్యాప్తంగా వివిధ డివిజన్ల నుంచి ఉద్యోగులు హాజరై మహాసభలను జయప్రదం చేశారు. రామాపురం మండలం నుంచి పోస్టుమాస్టర్ పూర్ణచంద్ర, లక్కిరెడ్డిపల్లె ఎన్ఎఫ్‌పీఈ పోస్టల్ నాయకులు తాటిగుట్ల మేఘనాథరెడ్డి, కడప డివిజనల్ పోస్టల్ సెక్రటరీ సుబ్బారెడ్డిలు పోస్టల్ ర్యాలీలో పాల్గొన్నారు.

శోభాయాత్ర

గాలివీడు : మండల ఆలయాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని పక్కీరారెడ్డిగారిపల్లె నుంచి అన్నమయ్య కూడలిలో ఉన్న శ్రీరామ స్వామి దేవస్థానం వరకు అయోధ్య నుంచి తెచ్చిన శ్రీరామ పూజిత అక్షింతల శోభాయాత్రను వైభవంగా నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అక్షింతలను రామాలయంలో పూజలు జరిపించి ప్రతి గ్రామానికి సంక్రాంతి తరువాత అందించే ఏర్పాటు చేస్తామన్నారు. యాత్రలో పెద్ద ఎత్తున్న మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయానికి రథం బహూకరణ


ఆలయానికి రథం అందజేసిన మాలధారులు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు గ్రామానికి ఆదివారం నూతన రథంను అయ్యప్ప స్వాములు ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళ్తే అయ్యప్ప స్వాములు గ్రామంలో పూజలు చేసేటప్పుడు అయ్యప్పస్వామిని ఊరేగించుటకు రెండు లక్షల రూపాయలతో నూతన రథాన్ని తయారు చేయించారు. ఈ రథం గ్రామంలోని అన్ని దేవాలయాలకు ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య, గ్రామస్తులు అయ్యప్ప స్వాములను అభినందించారు.

సారా విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లె : సారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆదివారం ముష్టూరు పంచాయతీ గొనిగారి పల్లె సమీపంలో శ్రీరాములు(60) సారా విక్రయిస్తున్నట్లు సమాచారంతో దాడిచేసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. 12 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు.

బలహీన వర్గాలు రాజకీయ చైతన్యం చెందాలి

పీలేరు : బడుగు, బలహీన వర్గాలు రాజకీయ చైతన్యం చెందాలని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.టి.ఎం. శివప్రసాద్ అన్నారు. ఆదివారం పీలేరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో 'రూల్ ఆంధ్రా' పేరుతో వీసీకే పార్టీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ఏడు శాతం ఓట్లు కలిగిన అగ్ర వర్ణాల వారు ఏడు దశాబ్దాలుగా రాష్ట్రాన్ని పాలిస్తున్నారని తెలిపారు. సామాజిక సంక్షేమం, సమగ్రాభివృద్ధి జరగాలంటే మెజారిటీ ప్రజలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపుల నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడాలని కోరారు. రాబోయే ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి అన్ని జిల్లాలో 'రూల్ ఆంధ్రా' చైతన్య సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. వీసీకే పార్టీ అధినేత డాక్టర్ తిరుమావళవన్ నేతృత్వంలో తమిళనాడులో ఇద్దరు ఎంపీలు, నలుగురు ఎమ్మెల్యే, 1050 మంది స్థానిక సంస్థల ప్రతినిధులు ఉన్నారని తెలిపారు. ఏపీలో కూడా వీసీకే పార్టీని అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు పాలకుంట శ్రీనివాసులు, డాక్టర్ సి. చంద్రయ్య, గణపతి, కె.వి. రమణ, మోహన్, తాతయ్య, టి.ఎ. పీర్‌బాషా, ముల్లంగి కృష్ణయ్య, నాగరాజ, మల్లికార్జున, నారాయణ, రమణ, బాలకృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- పలు అభివృద్ధి పనుల ప్రారంభం
- పాల్గొన్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి
- వెలిగల్లులో చేప పిల్లలను వదిలిన ఎమ్మెల్యే


గుండ్లచెరువు సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


వెలిగల్లు రిజర్వాయర్‌లో చేప పిల్లలను వదలుతున్న దృశ్యం

గాలివీడు : రాష్ట్ర ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం తూముకుంట వెలిగల్లు, గాలివీడు, పారంపల్లె, గొపనపల్లె, గుండ్లచెరువు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులలో భాగంగా కోట్లాది రూపాయలతో నిర్మించిన తారు రోడ్లు, సిమెంటు రోడ్లు, వాటర్ ప్లాంట్లు, నూతన సచివాలయాల భవనాలను మండల నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా గుండ్లచెరువు, వెలిగల్లు గ్రామాల్లోని సచివాయాల వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వైద్యం, విద్య, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేస్తూ మరోవైపు నవరత్నాలను అమలు చేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో పేదరికం అనేది లేకుండా సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని చెప్పారు. గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు ఆయన వృద్ధులను, మహిళలను ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. చిన్నచిన్న సమస్యలతో ఎక్కడైనా పథకాలు అందలేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు చిరునవ్వుతో పథకాలు అందుతున్నాయని వివరించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు 2014లో వ్యవసాయ, డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేయకుండా ప్రజలను నిలువునా మోసగించిన తీరును వివరించారు. ప్రజలు ఎక్కడ నిలదీస్తారనే భయంతో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం మేనిఫోస్టును మాయం చేయడాన్ని గుర్తు చేశారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లిద్దరు ఉమ్మడి మేనిఫోస్టుతో వస్తున్నారని, వారికి తగిన రీతిలో ఓటర్లు బుద్ధి చెప్పాలన్నారు. ప్రజలకు సుపరిపాలనను అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు.

శుద్ధి జలం అందించడమే ధ్యేయం

ప్రజలకు శుద్ధి జలాన్ని అందించడమే ప్రభుత్వం ధ్యేయమన్నారు. తూముకుంట, గుండ్లచెరువు, గోపనపల్లె గ్రామాలలో దాదాపు 10 ఆర్‌ఓ ప్లాంట్లను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. శుద్ధి జలం అందడంపై గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం తూముకుంట, వెలిగల్లు గ్రామాల ప్రజలకు ఏపీఎస్‌బీసీఎల్ నిధులతో 1,200 సోలార్ ల్యాంపులను పంపిణీ చేశారు. తదుపరి వైఎస్సార్ వెలిగల్లు ప్రాజెక్టులో 8 లక్షల చేప పిల్లలను వదిలారు. మత్స్యకారుల సంక్షేమానికి జగనన్న పెద్దపీట వేస్తున్నారన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా చేప పిల్లలును వదిలారు. మత్స్యకారులకు రూ.10లక్షల బీమాను అందిస్తోందని తెలియజేశారు.

పరామర్శ

గుండ్లచెరువు గ్రామం దుగ్గనవాండ్లపల్లెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కాల్వపల్లె వెంకటరమణ రెడ్డి కుమారుడు విశ్వనాథరెడ్డి ఇరవై రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. అలానే మండల కేంద్రంలో గుండెపోటుతో మృతి చెందిన చెన్నమ్మ మృతదేహానికి ఆయన నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ జిల్లా పద్మావతమ్మ, వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆవుల నాగభూషన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్‌మొహిద్దిన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సోలార్ అధికారులు, మత్స్య శాఖ అధికారులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి పూజలు


నందీశ్వరుడికి పూజలు చేస్తున్న పురోహితులు

చిట్వేలి : స్థానిక శ్రీ శ్యామలాంబ సమేత శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం నందీశ్వరుడికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. రాజుకుంట నివాసం మాదినేని చిన్నా రాయల్ కుటుంబ సమేతంగా పూజా కార్యక్రమాలను నిర్వహించగా అర్చకులు సురేంద్ర శర్మ, పవన్ శర్మలు పూజాది కార్యక్రమాలను జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రతి రైతుకు నష్టపరిహారం

ఓబులవారిపల్లె : తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకు పంట నష్టం అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సీనియర్ నాయకుడు ఓజీ శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తుపాను కారణంగా జిల్లేల మడక తదితర ప్రాంతాల్లోని అరటి, తమలపాకు రైతులకు అపార నష్టం జరిగిందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన ప్రతి రైతు వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపించాలన్నారు. అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి వ్యవసాయం చేసిన రైతులకు తుపాను కోలుకోలేని దెబ్బతీసిందని చెప్పారు.

తేనెటీగలు రైతు నేస్తాలు


తేనెటీగల ప్రయోజనాలను తెలుపుతున్న వరప్రసాద్‌రెడ్డి

రాజంపేట టౌన్ : తేనెటీగలు రైతు నేస్తాలని సృజనాత్మక రైతు అవార్డు గ్రహీత ఆకేపాటి వరప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని హస్తవరం పొలాల్లో ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు 'ప్రకృతిలో తేనెటీగల పాత్ర' అనే అంశంపై జువాలజీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరపరాగ సంపర్కంలో పాల్గొని పంటల ఉత్పాదనకు తేనెటీగలు దోహదపడగలవని వరప్రసాద్‌రెడ్డి విద్యార్థులకు తెలిపారు. స్వచ్ఛమైన తేనెను కూడా ఇచ్చి రైతు ఆదాయాన్ని పెంచుతాయన్నారు. ప్రకృతిలో తేనెటీగలు లేకపోతే మానవ జీవనం అంతరించి పోతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తేనెటీగల ఉత్పత్తి గురించి వివరించారు. కార్యక్రమంలో జువాలజీ అధ్యాపకుడు డాక్టర్ ఎస్.చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న అబ్దుల్ రజాక్

రాయచోటి అర్బన్ : ఉపాధ్యాయులందరికీ సకాలంలో జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ రజాక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.రవి శంకర్, కె.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని బీటీఏ కార్యాలయంలో వారు మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఉపాధ్యాయులకు చాలా వరకు నెలలో 15వతేదీ నాటికి కూడా అకౌంట్లలో జమకావడం లేదన్నారు. ఫలితంగా బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించలేక, చెక్‌బౌన్స్‌లు కావడం వలన జరిమానాలు చెల్లించడం, వ్యక్తిగత సిబిల్ స్కోర్ పడిపోవడం వలన బ్యాంకు రుణాల మంజూరు తీవ్ర ఆటంకం కలగడం లాంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయాలను గుర్తెరిగి ప్రతినెలా 1వతేదీనే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఉపాధ్యాయులకు బకాయిలు పడ్డ డీఏలు, ఆర్జిత సెలవులు, పీఎఫ్ లోన్ వెంటనే మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లం రామచంద్ర, జిల్లా సంయుక్త కార్యదర్శి ఎం.చిన్న చంద్రాయుడు, బాలిపోగు రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పశు ఆరోగ్య కార్డుల పంపిణీ


పశు సమాచారాన్ని సేకరిస్తున్న సిబ్బంది

చిట్వేలి : పశు ఆరోగ్య కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వర్తిస్తున్నట్లు చిట్వేలి ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ కేడీ వరప్రసాద్ పేర్కొన్నారు. మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్న రాజుకుంట, చింతలచెలిక గ్రామాలలో శనివారం రాత్రి పశుసంవర్ధకశాఖ అధికారులు పర్యటించి పశు ఆరోగ్య కార్డుల పంపిణీకి అవసరమైన సమాచారాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఏడీ వరప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన రాజుకుంటలో పశు హెల్త్ కార్డుల పంపిణీకి రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ విశ్రాంత ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ రామ లింగరాజు ముఖ్య అతిథిగా వస్తున్నారన్నారు. కార్యక్రమ నిర్వహణపై సర్పంచ్ నరసింహతో చర్చించామన్నారు. గ్రామంలోని యువపాడి రైతు వద్దగల 12 ముర్రా జాతి పెయ్యదూడల సంరక్షణపై ఏడీ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు వెంకటసుబ్బయ్య, శివప్రసాద్, డేటా ఆపరేటర్ నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అమ్మవారికి పూజలు


లక్కిరెడ్డిపల్లె: అనంతపురం గంగమ్మ ఆలయంలో..


సిద్దవటం: ప్రత్యేక అలంకారంలో నల్లగంగమ్మ

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీ అనంతపురం గంగమ్మకు భక్తులు బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ప్రత్యేక అధికారి రవీంద్రరాజు, చైర్మన్ నరసింహారెడ్డిలు సౌకర్యాలు కల్పించారు. ఆలయ పూజారులు రెడ్డి శేఖర్, చంద్రశేఖర్‌లు అమ్మవారికి అభిషేకం చేయడంతోపాటు కుంకుమార్చనలు జరిపారు. చుట్టుపక్కల ప్రాంతాల వారే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారికి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లగంగమ్మకు పూజలు

సంబేపల్లె : మండల పరిధిలో వెలసిన నల్ల గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారిని పూలతో అలంకరించారు. వేకువజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా రెడ్డెమ్మతల్లికి గాజుల అలంకరణ


గాజుల అలంకరణలో రెడ్డెమ్మ తల్లి

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి గాజుల అలంకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్తీక మాసం త్రయోదశి రోజును పురస్కరించుకొని భక్తులు, ప్రజల నుంచి గాజులను సేకరించారు. అలా సేకరించిన గాజులతో ఆదివారం ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈసందర్భంగా వేకువజామునే అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు.

ఉచితంగా కంటి వైద్యం అందించడం హర్షనీయం


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఓబులవారిపల్లె : పేదలకు ఉచిత కంటి వైద్యం శస్త్ర చికిత్సలు అందిచడం హర్షనీయమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ముక్కావారిపల్లె టీటీడీ కళ్యాణ మండపంలో మండలానికి చెందిన కీ.శే. మల్లు వెంకట సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం ప్రీమియం హోండా మేనేజింగ్ డైరెక్టర్ మల్లు ప్రసాద్‌రెడ్డి శంకర నేత్రాలయం చెన్నై వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్, వైఎస్సార్‌పార్టీ మండల అధ్యక్షుడు వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రభుత్వ విప్ కొరముట్ల మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా శంకర నేత్రాలయం చెన్నై వారు మొబైల్ కంటి శస్త్ర చికిత్స అందిస్తున్నారన్నారు. మండలంలో పేదలకు వారి ద్వార ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి శస్త్రచికిత్సలు మల్లు ప్రసాద్‌రెడ్డి చేయించడం హర్షనీయమన్నారు. నియోజవర్గం వ్యాప్తంగా ఉచిత శిబిరాలను నిర్వహించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ శంకర నేత్రాలయం చెన్నై వారి ద్వార రాజంపేటలో పేదలకు తన ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య సేవలను అందించామన్నారు. కొందరికి చెన్నైకి పంపించి వైద్యం చేయించినట్లు చెప్పారు. ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం పట్ల ఆకేపాటి మల్లు ప్రసాద్‌రెడ్డిని అభినందించారు. మల్లు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల మండలానికి వచ్చినప్పుడు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు సూచనల మేరకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికి పరీక్షించి, ఆపరేషన్లు కూడా చేసి అవసరమైన మందులు, అద్దాలు అందిస్తామన్నారు. అంతకు ముందు అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. దాదాపు రెండు వందల మంది రోగులకు మొదటి రోజు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముక్కా మధుసూదన్‌రెడ్డి, పీస్ రామసుబ్బారెడ్డి, ఓజీ శ్రీనివాసులరెడ్డి, నాగ శివశంకర్‌రెడ్డి, మల్లికార్జున రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర, చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులరెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ జి.సుధాకర్‌రాజు, రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, డీఆర్‌సీసీయూ మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుబ్రమణ్యంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ అమృతాల సుబ్రమణ్యం, ఎంపీడీఓ విజయారావు, వైద్యాధికారి రాజశేఖర్, మంగంపేట ఉప సర్పంచ్ కొలూరు మధుసూదన్‌రెడ్డి, పులపత్తూరి రామసుబ్బారెడ్డి, పి.రామిరెడ్డి, వడ్డి చెంగల్‌రెడ్డి, మల్లు సుబ్బారెడ్డి, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వన భోజనాలు


రుద్రాభిషేకం నిర్వహిస్తున్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని ఎర్రచందనం పార్కులో ఆదివారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు నిర్వహించారు. శివునికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం సంఘ సమావేశం అధ్యక్షుడు సి.నరసింహ మాట్లాడుతూ కార్తీక వన భోజనాలు ప్రతి ఏడాది నిర్వహించడం ద్వారా సంఘంలో ఐక్యత ఏర్పడుతుందన్నారు. అలాగే ఈ ఏడాది కార్తీక వన భోజనానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కొత్తకోడూరులో నూతనంగా నిర్మిస్తున్న శంకర మఠంలో ఫిబ్రవరి 14వ తేదీన ప్రతిష్టా కార్యక్రమాలు నిర్వహించనున్నామని, కావున ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సురేష్ బాబు, సురేష్, పిడతల రామ్మోహన్, ఓరుగంటి అనీల్, వేణుమాదవ్, ఓసంగి శ్రీకాంత్, ఓసంగి అరవింద్, బి పవన్ కుమార్, పులిచెర్ల ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో నేడు..

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట సమీపంలో ఉన్న సమర్థ సద్గురు సాయి మందిరంలో పవిత్ర కార్తీక మాసంలో చివరి సోమవారంలో భాగంగా వన భోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దర్బారు సాయి భక్తులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్బారు సాయినగర్‌లో ఉన్న ముక్తా లింగేశ్వరస్వామి విగ్రహానికి రుద్రాభిషేకం పూజలు బెంగళూరుకు చెందిన వేద పండితులచే భక్తుల సమక్షంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

చిన్నమండెం : మండల పరిధిలోని టి.సాకిబండ గ్రామ సమీపంలోని నల్లగుట్ట వద్ద కోడిపందేలు ఆడుతున్న 17 మందిని అరెస్టు చేసినట్లు రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ రమేష్‌బాబు, పోలీసు సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించామన్నారు. కోడిపందెం ఆడుతున్న 18 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.25,500 నగదుతోపాటు 11 కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నేడు లక్ష దీపోత్సవం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని అంకిరెడ్డిపల్లి సమీపంలో వెలసిన శ్రీ భైరవేశ్వరస్వామి ఆలయంలో సోమవారం లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కనుల పండువగా జరిగే కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

దివ్యాంగుల పట్ల చిన్నచూపు తగదు


దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : దివ్యాంగుల సంక్షేమం పట్ల పాలకులు చిన్నచూపు చూడడం తగదని దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రంగారెడ్డి అన్నారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని జరిపారు. ఆయన మాట్లాడుతూ పాలకులు దివ్యాంగుల పట్ల కరుణ చూపాలన్నారు. తెలంగాణ రాష్ట్రం తరహాలో ఇక్కడ కూడా దివ్యాంగుల పెన్షన్ మొత్తాన్ని పెంచాలని కోరారు. లేనిపక్షంలో భవిష్యత్తులో జరుగబోవు ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామన్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగులు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ సయ్యద్ రియాజుద్దీన్, మాజీ అధ్యక్షులు కూనా కృష్ణదేవరాయలు, అష్రఫ్ అలీ, డాక్టర్ మహేశ్వరరాజు, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి పరుశురాం, మణికంఠ, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు మహాపాదయాత్ర


పాదయాత్రలో పాల్గొన్న సాయికిషోర్ రెడ్డి

ఓబులవారిపల్లె : అన్నమయ్య కాలిబాటన ముక్కావారిపల్లె వైస్ సర్పంచ్ ముక్కా రూపేష్ కుమార్ రెడ్డి ఆరవ మహాపాదయాత్రను ఆదివారం అంకాల పరమేశ్వరి ఆలయం నుంచి ప్రారంభించారు. వందలాది మంది భక్తులు గోవింద మాలలు ధరించి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా రూపేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య కాలిబాటన వరుసగా ఆరోసారి పాదయాత్రగా వెళ్తున్నామని, రాష్ట్రంలో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండేలా వేంకటేశ్వరస్వామి ఆశీర్వదించేందుకు ఈ పాదయాత్ర చేపట్టామన్నారు. ఏపీ టీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి కొర్లకుంట అడ్డరోడ్డు నుండి పాదయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కిరెడ్డి మధుసూదన్ రెడ్డి, పలపుత్తూరు రామసుబ్బారెడ్డి, సిద్దారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు గడ్డం ఆదినారాయణ రెడ్డి, డీఆర్‌సీసీయూ మెంబర్ తల్లెం భరత్‌కుమార్, ఎ.సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీఎస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చొప్పా ఎల్లారెడ్డి

రాజంపేట : ఏఐటీఎస్‌లో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఏఐటీఎస్ ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐటీఎస్‌లో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించారంటే తమకెంతో సంతోషంగాను, గర్వంగాను ఉంటుందన్నారు. పూర్వవిద్యార్థులు ప్రగతి పాటలను ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు తెలియజేయాలన్నారు. సరస్వతి ఉంటే వెనువెంటే లక్ష్మీ దేవి కూడా వస్తుందనేది గుర్తుంచకోని, చదువుకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ నారాయణ మాట్లాడుతూ విద్యను కష్టంగా కాకుండా ఇష్టంగా చదువుకునే విద్యార్థులు ఉన్నత శ్రేణిలో ఉంటారన్నారు. కళాశాల అలమ్నీ ఇన్‌చార్జి డా.కాశిగారి ప్రసాద్ మాట్లాడుతూ అలమ్నీ సమావేశాలకు పూర్వవిద్యార్థులు హాజరై, తోటి విద్యార్థులకు తమ అనుభవాలను తెలియజేయాలని కోరారు.

నేడు మహాకుంభాభిషేకం

మదనపల్లె : మండలంలోని శ్రీనేలమల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణ తెలిపారు. ప్రతి ఏడాది కార్తీకమాసం చివరి సోమవారం కుంభాభిషేక మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా పవిత్ర కుమారనది నుంచి శుద్ధజలాన్ని ఊరేగింపుగా తెచ్చి స్వామివారిని అభిషేకించనున్నట్లు చెప్పారు. అభిషేకజలంలో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. కుంభాభిషేక మహోత్సవానికి మదనపల్లె ఆర్టీసీ డిపో అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు.